# అంకెల గారడీ కోసం

'అంత పెద్ద ఆసుపత్రిని నేను అదే చూడడం. ఎలాగో ప్రయాసపడి నా స్నేహితుణ్ణి చేర్పించాను. దూరంగా ఉన్న అతని తమ్ముడికి టెలిగ్రామ్ ఇచ్చి వచ్చికూర్చున్నాను. ఆ రోజుకి నేను చెయ్యవలసిన పనిలేదు. అతని మంచానికి ప్రక్కనే ఉన్న బల్లమీద కూర్చుని చేతిలో ఉన్న పుస్తకం తెరిచాను

ఉపనిషత్తుల కాలంనాటి ఋషులూ, తాత్త్వికులూ వేదకాలంనాటి యజ్ఞయాగాదుల ఆడంబరాన్నీ, అందులో బాధ్యతల వికేంద్రీకరణ ధోరణుల్నీ ఎలా ఏవగించుకున్నారో రచయిత వివరిస్తున్నాడు. "అన్ని ఖర్చులూ భరిస్తున్న యజ్ఞకర్త నామమాత్రంగా నేపథ్యంలో ఉంటాడు. అతని కోసం రకరకాల యజ్ఞాలు, ఒకొక్క యజ్ఞానికి ఒక్కో సంవిధానం, ప్రత్యేక మంత్రం. యజ్ఞశాల నిర్మాణం ఒకరూ, యజ్ఞ కుండం ఏర్పాటు ఇంకొకరూ, ముగ్గులు వెయ్యడం ఒకరూ, దేవతల చిత్రాలు వెయ్యడం ఒకరూ; హోత్రి ఋగ్వేదం, ఉద్గాత్రి సామవేదం, అధ్వర్యుడు యజుర్వేదం చదువుతే బ్రహ్మ (ముఖ్యుడు) అధర్వవేద మంత్రాలు చదివి పర్యవేక్షణ చేస్తాడు. సత్యాన్వేషణా, జ్ఞానసముపార్జనా తద్వారా జనకల్యాణం అన్న పరమ లక్ష్యం అప్రధానం అయిపోయి

యజ్ఞ సంవిధానం ఎంతో క్లిష్టమై కూర్చుంది—" ఇలా చదువుతూ పోర్టికోతో సాగుతున్న కలకలానికి గోలకీ నా చేతిలోని పుస్తకం కాస్త పక్కకునెట్టి అటు చూశాను ఆ గొడవ సాయంత్రందాకా కొనసాగింది. అందరి దృష్టి ఆకర్షించింది.

ఏం కష్టమో ఏం కారణమో ఒక స్త్రీ ఎత్తైన మేడమీంచి అమాంతం కిందపడిపోయింది. దారినపోయేవాళ్ళూ, మనసున్నవాళ్ళూ ఆమెను ఆసుపత్రికి చేర్చారు. ఎమర్జన్సీ వార్డులో డాక్టర్లు కంటిపాపలు పరిశీలించి, ఇతరత్రా చేయవలసిన పరీక్షలుచేసి, కాళ్ళకూ, చేతులకూ, వెన్నుపూసకూ, తలకూ ఫ్రాక్చర్స్ అయినట్లు రిపోర్టు రాసి ఆర్థోపెడిక్ వార్డుకి ఆ పేషంట్‌ని పంపించారు కానీ ఆ వార్డువాళ్ళు ఆ కేసును అడ్మిట్ చేసుకుందుకు మొరాయించారు. మెదడు దెబ్బతిన్నది కాబట్టి ఆ స్త్రీ బ్రతికే అవకాశం శూన్యం అన్న అంచనా వేశారు. వాళ్ళ వార్డులో ఒక కేసు విఫలం అయినట్లు వార్షిక లెక్కల్లో (Annual Statistical Record) చూపించడం చేదుగా, బాధగా ఉంటుంది. అసలు ఈ కేసు న్యూరో సర్జరీ వార్డులో చూడాలని అక్కడికి పంపించారు. అంచనాలు వెయ్యడంలో న్యూరో సర్జికల్ గ్రూప్ ఏం తక్కువ తినలేదు. ఆర్థోపెడిక్ వార్డే ఈ కేసు తీసుకోవాలని వాదించి తిప్పి పంపారు. వాళ్ళ వాగ్వివాదం అలా సాగుతూనే ఉంది. ఆ స్త్రీ పాపం జాలిపడి ఏ వార్డులోకీ పోకుండా, వరండాలోనే స్ట్రెచ్చర్‌మీద అంతిమ శ్వాస విడిచింది.

స్టేటిస్టికల్ రికార్డు దెబ్బతినకుండా రక్షించుకున్న ఆ రెండు వార్డుల పెద్దలూ గట్టిగా ఊపిరి తీసుకున్నారు.

—ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక 15-2-1990
(స్టేటిస్టిక్స్ అన్న పేరుతో)